ఆయకట్టు చివరికి నీరందేదెలా?


మాధన్నపేట పెద్దకాల్వలో పేరుకుపోయిన గుర్రపు డెక్క


ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు

- కాల్వలో పేరుకుపోయిన నాచు, గుర్రపు డెక్క, పిచ్చి మొక్కలు
- మాధన్నపేట పెద్దకాల్వ నీటిని విడిచారు
- కాల్వలు శుభ్రం చేసుడు మరిచారు
- సాగునీరు అందక రైతులకు తప్పని ఇబ్బందులు

నర్సంపేట రూరల్ : నారు పోసుకునేందుకు నీరు లేదు.. నాచు, గుర్రపు డెక్క, పిచ్చి మొక్కలతో కాలువలు నిండి ఆయకట్టు చివరి మడికి నీరు అందే పరిస్థితి లేదు.. దీంతో వానాకాలం సాగుకు నీరు అందక అన్నదాతలు అరిగోస పడుతున్నారు. ఇటీవల అధికారులు, ప్రజా ప్రతినిధులు అట్టహాసంగా నర్సంపేట మండలంలోని మాధన్నపేట చెరువు నుంచి సాగు నీటిని విడుదల చేయగా అది వృథాగా పోతుందే తప్ప.. సాగుకు అక్కరకు రాకుండా ఉంది. కనీసం కాల్వలను శుభ్రం చేయాలనే ఆలోచన లేకపోవడంతో విడ్డూరంగా ఉందని పలువురు విమర్శిస్తున్నారు.

నర్సంపేట మండలంలోని అతిపెద్ద చెరువు మాధన్నపేట.. ఈ చెరువు కింద మొత్తం 2,800 ఎకరాల ఆయకట్టు అధికారికంగా సాగవుతోందని, సుమారు మరో 500 ఎకరాల వరకు అనధికారికంగా సాగుచేస్తున్నారు. మాధన్నపేట చెరువుకు మొత్తం మూడు కాల్వలు ఉండగా అత్యధిక సాగు ఉన్న కాల్వ పెద్ద కాల్వే. ఈ కాల్వ సుమారు ఐదు కిలోమీటర్ల మేరకు సాగునీరు పారుతూ పోతుంది. ఈ కాల్వ కిందనే రైతులకు ఎక్కువ శాతం పంటల పొలాలు ఉన్నాయి. ఇది నర్సంపేట పట్టణం చుట్టూ తిరుగుతూ వస్తోంది. పూర్తిగా గుర్రపు డెక్క, నాచు, పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి కాల్వలను ముసితో కమ్మేసింది. దీంతో మాధన్నపేట చెరువు నీరు వదిలినా చివరి ఆయకట్టు వరకు పారేది గగనంగా మారింది. ప్రతి సంవత్సరం అధికారులు కాల్వలను శుభ్రం చేయడం జరుగుతుందని, ఒకవేళ అధికారులు పట్టించుకోకపోతే రైతులే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి చందాలు వసూలు చేసి మరీ కాల్వలను శుభ్రం చేసుకుంటూ వెళ్తుంటారు. నర్సంపేట పట్టణంలోని వరంగల్ రోడ్డు, నెక్కొండ రోడ్డు ప్రాంతాల్లో రైతులు వానాకాలంలో సాగు నీరు అందక తీవ్ర ఇబ్బందులు పడాల్సి దుస్థితి ఏర్పడింది. ఇటీవల మాధన్నపేట చెరువు నీరు సమృద్ధిగా ఉన్నాయని నారు మడులకు నీరు అందించాలనే ఉద్దేశంతో అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి నీటిని వదిలిపెట్టారు. కానీ కాల్వలు శుభ్రంగా లేకపోవడంతో నీరంతా వృథాగా పోతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాల్వల్లోని పిచ్చి మొక్కలను శుభ్రం చేయిస్తే నారు మడులకు సైతం నీరందుతుందనిఆయకట్టు రైతులు కోరుతున్నారు.

క్లుప్తంగా

ఉచిత వైద్యశిబిరం


విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న జయపాల్ రెడ్డి

నల్లబెల్లి : సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని గోవిందాపూర్, నందిగామ పల్లె దవాఖానా వైద్యులు జయపాల్ రెడ్డి, శృతి తెలిపారు. మండలంలోని కొండాపూర్, లెంకాలపల్లి గ్రామాల్లో నల్లబెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో సోమవారం వైద్యశిబిరాలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాలతో జ్వరాల బారిన పడిన వారి ఇళ్లను, ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. జ్వరం లక్షణాలు ఉన్న పలువురిని గుర్తించి మందులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సాంబమూర్తి, ఏఎన్ఎంలు జయమ్మ, మనెమ్మ, అన్నమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నియామకం


బి. శివకుమార్

నెక్కొండ : మండల కేంద్రానికి చెందిన అడ్వకేట్ బండి శివకుమార్ జిల్లా యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి నుంచి శివకుమార్ నియామక పత్రం అందుకున్నారని టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి తెలిపారు. అనంతరం శివకుమార్‌కు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బక్కి అశోక్, రావుల హరీష్‌రెడ్డి, రాచకొండ రఘు, లావుడ్యా తిరుమల్ చౌహాన్, భిక్షపతి, లక్ష్మణ్, శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్‌హెచ్‌ఓగా రవికుమార్..



నర్సంపేట రూరల్ : నర్సంపేట పోలీస్‌స్టేషన్ హౌజ్ ఆఫీసర్‌గా ఎస్. రవికుమార్‌ను నియమిస్తూ వరంగల్ కమిషనర్ రంగనాథ్ ఉత్తర్వులు జారీచేశారు. నర్సంపేట సీఐగా విధులు నిర్వహిస్తున్న పులి రమేష్‌గౌడ్ వీఆర్‌కు బదిలీ కాగా ఆ స్థానంలో సీసీఎస్ వరంగల్ నుంచి రవికుమార్‌ను నర్సంపేట సీఐగా బదిలీ చేశారు. అదేవిధంగా నర్సంపేట ఎస్సైగా ఎస్.రవిని బదిలీపై రానున్నారు. ప్రస్తుతం మహబూబాబాద్ జిల్లాలో విధులు నిర్వహిస్తున్నారు.

మండల అధ్యక్షుడిగా రాజ్‌కుమార్ గౌడ్



నల్లబెల్లి : గౌడ జనహక్కుల పోరాట సమితి మోకు దెబ్బ మండల అధ్యక్షుడిగా పెరుమాండ్ల రాజ్‌కుమార్ గౌడ్‌ను నియమించినట్లు ఆ సంఘం డివిజన్ అధ్యక్షుడు కందుల శ్రీనివాస్ తెలిపారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తిప్పని రవీందర్, ప్రధాన కార్యదర్శిగా తండా సంపత్, ఉపాధ్యక్షులుగా ఏరుకొండ సదానందం, చిర్ర రమేష్, కోశాధికారిగా కక్కెర్ల శ్రీనివాస్, కార్యదర్శిగా పెరుమాండ్ల రాములు, సహాయ కార్యదర్శులుగా గాజర్ల రాములు, పులి నర్సయ్యతో పాటు కార్యవర్గ సభ్యులను నియమించినట్లు పేర్కొన్నారు.

'దళితబంధు' దరఖాస్తుల ఆహ్వానం

పర్వతగిరి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన దళితబంధు పథకానికి రెండో విడత దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ చక్రాల సంతోష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. లబ్ధిదారులు ఆధార్ కార్డు, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, దివ్యాంగులయితే ధ్రువీకరణ జిరాక్స్‌తో పాటు దరఖాస్తు పత్రం జత చేసి ఇవ్వాలన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి



నర్సంపేట : పార్టీ బలోపేతానికి బీఆర్ఎస్ నాయకులు సమన్వయంతో కృషి చేయాలని వార్డు అభివృద్ధి కమిటీ చైర్మన్, మాజీ ఎంపీపీ రుద్ర ఓంప్రకాశ్ అన్నారు. ఈ మేరకు పట్టణంలోని 13వ వార్డులో బీఆర్ఎస్ పార్టీ 13వ వార్డు అధ్యక్షుడు ఆబోతు రాజుయాదవ్ అధ్యక్షతన సోమవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓంప్రకాశ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సహకారంతో పట్టణం అభివృద్ధి చెందుతుందన్నారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గుంటి కిషన్, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు మాట్లాడారు. నర్సంపేట పట్టణంలో గతంతో పోల్చితే ప్రస్తుతం అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తుందన్నారు. మరోసారి నర్సంపేట గడ్డపై గులాబీ జెండా ఎగుర వేయడానికి బీఆర్ఎస్ పార్టీ నాయకులు కీలక పాత్ర పోషించాలన్నారు. వాసం కరుణ, దాసరి నర్సింహారెడ్డి, కడారి సత్యనారాయణ, బూస విజయలక్ష్మి, మేడిద శ్రీను, బాల్నె సుభాష్, శ్రీరాముల కోటేశ్వర్, అడ్డగట్ల సురేందర్, కామాని రవీందర్, బూస సంపత్, కుమారస్వామి పాల్గొన్నారు.

డబుల్ రోడ్డుకు నిధులు మంజూరు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్ది

నర్సంపేట : చెన్నారావుపేట మండల కేంద్రం నుంచి కోనాపురం, ఉప్పరపల్లి మీదుగా మచ్చాపురం వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. డబుల్ రోడ్డు నిర్మాణానికి చల్లా ధర్మారెడ్డితో కలిసి కృషి చేయడం వల్ల రూ.32కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. అంతే కాకుండా రూ.16కోట్లతో చెన్నారావుపేట, కోనాపురం, ఉప్పరపల్లి గ్రామాల పరిధిలో డబుల్ రోడ్డుతో పాటు డ్రెయినేజీ నిర్మాణం చేపడతామని అన్నారు. త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామన్నారు.ఈ సందర్భంగా సీఎం కేసీఆర్, రోడ్లు, భవనాల శాఖమంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, జిల్లా మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావులకు కృతజ్ఞతలు తెలిపారు.

రైతులు పండ్ల తోటలు సాగు చేయాలి

చెన్నారావుపేట : రైతులు పండ్ల తోటల, కూరగాయలు, పూల మొక్కల పెంపకానికి ముందుకు రావాలని ఎంపీడీఓ భారతి, డీఆర్‌డీఓ ప్లాంటేషన్ మేనేజర్ రమేష్ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, ఏఈఓలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లకు పండ్ల తోటల పెంపకం, పారిశుద్ధ్య పనులు, హరితహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పండ్ల తోటల పెంపకానికి నాలుగేళ్ల వరకు నిర్వహణ ఖర్చులు ప్రభుత్వం ఇస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు ఉచితంగా సన్న, చిన్నకారు రైతులకు ఇతర సామాజిక వర్గాలకు 90 శాతం సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందన్నారు. జాబ్ కార్డు ఉండి ఐదు ఎకరాల లోపు ఉన్న రైతులు ఆధార్, పట్టాపాస్ పుస్తకంతో వ్యవసాయ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. హెచ్ఓ జ్యోతి, డాక్టర్ సరోజ మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీధర్‌రాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మంజుల, రాధ, పశు వైద్యాధికారి మంజిలాల్, వ్యవసాయ అధికారి సూర్యనారాయణ, సర్పంచ్ కుండె మల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

'మాధవరెడ్డిపై బురదజల్లే ప్రయత్నం'


సమావేశంలో మాట్లాడుతున్న రామానంద్

నర్సంపేట : రైల్వే కాంట్రాక్టుల కోసం కేంద్రంలోని బీజేపీలో చేరి రాజకీయ పబ్బం గడుపుతున్న నర్సంపేట మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అధికార పార్టీని విమర్శించకుండా ప్రతిపక్ష పార్టీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిపై బురద జల్లే ప్రయత్నం చేయడం నీతిమాలిన రాజకీయాలకు నిదర్శనమని పీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, నియోజకవర్గ కన్వీనర్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్య గౌడ్ విమర్శించారు. ఈ మేరకు పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్ అధ్యక్షతన సోమవారం విలేరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధికి ప్రస్తుత బీజేపీ నాయకుడు రేవూరి ప్రకాశ్‌రెడ్డికి ఏం సంబంధం అని ప్రశ్నించారు. అధికార పక్షాన్ని ప్రశ్నించకుండా మాధవరెడ్డి గెలుపు చేరువలో ఉన్నారని గమనించిన రేవూరి ప్రకాశ్‌రెడ్డి తన రాజకీయ ఉనికి కోసం మాధవరెడ్డిపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. 2004నుంచి 2014వరకు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో రంగయ్య చెరువు రిజర్వాయర్‌కు రూ.300కోట్లు, 365హైవే ఏర్పాటుకు, మోడల్ స్కూల్, సక్సెస్ స్కూల్‌ల నిర్మాణానికి కృషి చేసింది మాధవరెడ్డి అన్న విషయం గుర్తు పెట్టుకోవాలన్నారు. పాకాల, మాధన్నపేట సీసీ లైనింగ్‌తో పాటు నియోజకవర్గంలోని అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసింది మాధవరెడ్డి అని గుర్తు చేశారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. బీజేపీ నాయకులు ఆదివారం చేపట్టిన ధర్నా కార్యక్రమంలో పది శాతం మంది కూడా కార్యకర్తలు లేరని, వారి పార్టీ శక్తి ఎంతో ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. 610జీఓ చైర్మన్‌గా ఉండి ఉద్యోగాల రికార్డులు అప్పగించకుండా తెలంగాణ నిరుద్యోగులకు ద్రోహం చేశారని అన్నారు. భవిష్యత్‌లో మాధవరెడ్డిపై తప్పుడు ప్రసంగాలు చేస్తే మాధవరెడ్డి అభిమానులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాలాయి శ్రీనివాస్, చింతల సాంబరెడ్డి, కౌన్సిలర్ ఎలకంటి విజయ్‌కుమార్, ములుకల వినోదసాంబయ్య, మెరుగు సాంబయ్య, నూనె పద్మ, కొలువుల వెంకటేశ్వర్లు, పంబి వంశీ, తదితరులు పాల్గొన్నారు.

తెగిన కాజ్‌వే, రోడ్ల పరిశీలన


కోనాపురం కాజ్‌వేను చూపిస్తున్న స్థానికులు


రాయపర్తి: కొండూరులో..

వర్ధన్నపేట : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వర్ధన్నపేట పట్టణ పరిధిలోని కోనాపురం వెళ్లే రహదారి కాజ్‌వే, అక్కకుంటకు వెళ్లే రోడ్డు కోతకు గురై తెగిపోయాయి. కాగా వాటిని సోమవారం పీఆర్, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు పరిశీలించారు. కోనాపురం వెళ్లే రహదారి కాజ్‌వే కోతకు గురై వరద ప్రవాహం ఉండడంతో ప్రయాణికులు చుట్టూ తిరిగి రావాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా కోనారెడ్డి చెరువు మత్తడి ప్రవాహం ఉధృతంగా ఉండడంతో అక్కకుంట రహదారి కోతకు గురై రైతులు తమ పంట పొలాలకు వెళ్లాలంటే నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే రమేశ్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన అధికారులను ఆదేశించారు. పీఆర్ ఏఈ రాజేందర్‌రెడ్డి, మున్సిపల్ ఏఈ అనిల్, ఇరిగేషన్ ఏఈ అమర్‌నాథ్‌లతో కలిసి మున్సిపల్ చైర్ పర్సన్ ఆంగోత్ అరుణ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోతకు గురైన రహదారులను పరిశీలించామని త్వరలో అంచనాలు రూపొందించి నివేదిక తయారు చేసి తదుపరి నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభించి పూర్తి చేస్తామన్నారు.

రోడ్డును త్వరగా మరమ్మతు చేయాలి

రాయపర్తి : వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్లను త్వరగా మరమ్మతు చేయాలని ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్ సూచనలిచ్చారు. సోమవారం మండలంలోని కొండూరు గ్రామంలోని శ్మశాన వాటికకు వెళ్లే రోడ్డు వర్షంతో ధ్వంసం కాగా ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి పరిశీలించారు. రైతుబంధు మండల అధ్యక్షుడు ఆకుల సురేందర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ జక్కుల వెంకట్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, సర్పంచ్ కర్ర సరితరవీందర్‌రెడ్డి, పీఆర్‌ఏఈ శ్రీప్రియ, ఉపసర్పంచ్ కొమ్ము రాజు, కొమ్ము కుమార్, గుంటుక నగేష్ పాల్గొన్నారు.

రేపటి నుంచి 'తొలిమెట్టు'



చెన్నారావుపేట : మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు తెలుగు, ఇంగ్లిష్, గణితం, సబ్జెక్ట్‌లపై ఈ నెల 2 నుంచి 8 వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామని కోర్సు డైరెక్టర్, మండల నోడల్ ఆఫీసర్ బైరి సరళ తెలిపారు. ఈ మేరకు మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ప్లానింగ్ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శిక్షణకు హాజరయ్యే ఉపాధ్యాయులు టెక్స్ట్‌బుక్స్, నోట్‌బుక్స్, టీఎల్ఎం మెటీరియల్‌తో పాటు లంచ్‌బాక్స్ వెంట తెచ్చుకోవాలన్నారు. తప్పనిసరిగా ఉపాధ్యాయులు హాజరు కావాలని తెలిపారు. ఎస్ఆర్‌జీ రాయపురెడ్డి, కాంప్లెక్స్ హెచ్ఎం పాపమ్మ, రజిని, ఆర్‌పీలు యాకయ్య, సుభాష్, సుధాకర్‌రెడ్డి, ప్రతాప్, రవి, సాంబయ్య, సిబ్బంది అశోక్, స్వప్న, యాదగిరి, సీఆర్‌పీలు సంపత్, బాలు ఉన్నారు.

విద్యార్థులకు గుణాత్మక విద్యనందించాలి

దుగ్గొండి : ఉపాధ్యాయ శిక్షణ శిబిరాల ద్వారా విద్యార్థులకు గుణాత్మక విద్యనందించే అవకాశం ఉంటుందని మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ అన్నారు. స్థానిక విద్యావనరుల కేంద్రంలో భాషా గణిత సామర్థ్యాల సాధన కోసం ఈ నెల 2నుంచి నిర్వహించనున్న శిక్షణా శిబిరాల కోసం సోమవారం సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఉపాధ్యాయులు తరగతి గదిలో విద్యార్థులకు బోధించాలన్నారు. ఈకార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, హెచ్ఎం ప్రవీణ్‌కుమార్, దుర్గాప్రసాద్, నర్సింహులు, రామ్మోహన్, శ్రీనివాస్, నవీన్‌గౌడ్, సుల్తానాభేగం పాల్గొన్నారు.

లింగన్న స్ఫూర్తితో ఉద్యమించాలి


లింగన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బాధ్యులు

నర్సంపేట : కామ్రేడ్ లింగన్న స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు ప్రజలు ఉద్యమించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా డివిజన్ సహాయ కార్యదర్శి అడ్డూరి రాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం లింగన్న వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ భూమి, భుక్తి విముక్తి కోసం కొనసాగిన భారత విప్లవ ఉద్యమంలో ప్రధాన భూమిక పోషించిన లింగన్న 2019లో బూటకపు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడన్నారు. తాడిత, పీడిత, పేద ప్రజలకు పోడు భూములు సాధించడంలో క్రియాశీలక పాత్ర పోషించాడన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలతో వరద బాధితులు గగ్గోలు పెడుతుంటే పాలకులు మాత్రం తిరిగి అధికారంలోకి రావడానికి ఎన్నికల గారడీ ఆడుతున్నారని విమర్శించారు. నాయకులు కత్తుల కొమురన్న, జవహర్‌లాల్, మనోహరచారి, రాజేందర్, శేఖర్, మల్లన్న, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


పర్వతగిరి: పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రమేశ్

వర్ధన్నపేట : వర్ధన్నపేట పట్టణానికి చెందిన రాజబోయిన ఐలయ్య(75) అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు. కాగా ఐలయ్య మృతదేహాన్ని ఎమ్మెల్యే అరూరి రమేశ్ సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అదే విధంగా కడారిగూడెం గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు చొల్లేటి రాంరెడ్డి, బొక్కలగూడెంకు చెందిన వార్డు సభ్యుడు పఠాన్ కాసీం కుమారుడు ఉస్మాన్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ల్యాబర్తి గ్రామానికి చెందిన పిన్నింటి సుధాకర్‌రావు తండ్రి ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబాలను కలిసి వారిని పరామర్శించి ఆర్థిక సాయం అందచేసి వారికి అండగా ఉంటామని ఎమ్మెల్యే అన్నారు. ఎంపీపీ అన్నమనేని అప్పారావు, జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, తూళ్ల కుమారస్వామి, నాయకులు తుమ్మల యాకయ్య, సిలువేరు కుమారస్వామి, పూజారి రఘు తదితరులు ఉన్నారు.

పర్వతగిరి : మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ఉద్యమకారుడు అక్కల సాంబయ్య, వడ్లకొండ గ్రామానికి చెందిన ఆమడగాని పాపయ్య, నారాయణపురం గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు కందికట్ల యాకయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కాగా వర్ధన్నపేట ఎమ్మెల్యే రమేశ్ సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. జెడ్పీటీసీ సింగ్‌లాల్, మోటపోతుల మనోజ్ గౌడ్, సోమేశ్వర్‌రావు, ఏకాంతంగౌడ్, మేడిశెట్టి రాములు, దేవేందర్, రాజు, శ్రీనివాస్ ఉన్నారు.

క్రైం కార్నర్

బైండోవర్

నల్లబెల్లి : మండలంలోని నల్లబెల్లి, ముచ్చింపుల తండా గ్రామాల్లో ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు నిర్వహించి నాటుసారా తయారీ, రవాణా చేసిన నేరాల్లో నలుగురిని గుర్తించి తహసీల్దార్ ఎదుట సోమవారం హాజరుపరిచినట్లు ఎక్సైజ్ సీఐ నరేష్ రెడ్డి తెలిపారు. కాగా వారికి రూ.2 లక్షల వ్యక్తిగత పూచికత్తుతో రెండు సంవత్సరాల కాలానికి బైండోవర్ విధించినట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటు సారా తయారీ చేసిన, రవాణా చేసిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.


ఉరివేసుకొని ఒకరు మృతి

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని మహేశ్వరం గ్రామానికి చెందిన చిదిరాల హేమంత్ (19) నర్సంపేట పట్టణంలో ఓ మార్ట్‌లో పని చేస్తున్నాడు. అయితే హేమంత్ మూడు నెలల నుంచి ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతూ ఉండేవాడన్నారు. ఈవిషయాన్ని మనసులోనే పెట్టుకొని దిగాలుగా ఉంటున్నాడు. కాగా సోమవారం ఇంట్లో ఎవరులేని సమయంలో తాడుతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి వీరస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.

చెట్టును ఢీకొట్టిన కారు

వర్ధన్నపేట : అతి వేగంగా వస్తున్న ఓ కారు మలుపు వద్ద అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని, ఇంటి గోడను, చెట్టుకు ఢీ కొట్టి ఆగిపోయింది. ఈ సంఘటన సోమవారం తెల్లవారు జామున మండలంలోని ఇల్లంద గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. బొల్లికుంట నుంచి మైలారం వైపునకు వెళ్తున్న ఓ కారు సోమవారం తెల్లవారు జామున ఇల్లంద సమీపంలో వరంగల్-ఖమ్మం జాతీయ రహదారి మూలమలుపు వద్ద అతి వేగంగా వస్తూ అదుపు తప్పింది. ఆ కారులో నలుగురు యువకులు ప్రయాణిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. కారులో ప్రయాణిస్తున్న యువకులు కారును అక్కడే వదిలేసి వెళ్లి పోయారని వారు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



రాయపర్తి : మండలంలోని కొండూరు గ్రామానికి చెందిన గిట్టెబోయిన సోమయ్య తన వ్యవసాయ భూమిలో మేతకోసం సోమవారం దుక్కిటెద్దును వదిలాడు. ఈ క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే ఎద్దు మేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురి కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. రూ.80వేల విలువైన దుక్కిటెద్దు మృతిచెందడంతో రైతు సోమయ్య బోరున విలపించాడు. ప్రభుత్వం ఆదుకోవాలని రోదించాడు.

దుర్గమ్మగుడిలో చోరీ

రాయపర్తి : మండలంలోని బంధనపల్లి దుర్గమ్మ గుడిలో ఆదివారం రాత్రి చోరీ జరిగినట్లు సర్పంచ్ దీప్లానాయక్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2021లో గుడిని నిర్మించుకున్నప్పటి నుంచి హుండీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పెద్దమొత్తంలో నిర్వహించే ఈ పండుగలో అధిక సంఖ్యలో భక్తులు హుండీలలో కానుకలు వేసినట్లు తెలిపారు.ఈ విషయంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు.


సంక్షిప్త సమాచారం

పోస్టర్ల ఆవిష్కరణ



రాయపర్తి : ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు ఎం.వెంకన్న పిలుపునిచ్చారు. సోమవారం మండలకేంద్రంలో ఈ నెల 4న హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన కార్మిక గర్జనకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక గర్జనకు అధిక సంఖ్యలో కార్మికులు హాజరై విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రకాష్, గబ్బెట దేవేందర్, సంకినేని దశరథం, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక



ఖానాపురం : మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సోమవారం ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి, ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఒక్క సారి ఎమ్మెల్యేగా గెలిపిస్తేనే కోట్లాది రూపాయల నిధులతో పెద్ది సుదర్శన్‌రెడ్డి అభివృద్ధి చేయించడం జరిగిందన్నారు. మరో సారి గెలిపించుకుంటే నియోజకవర్గం అభివృద్ధి మరింత పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మహాలక్ష్మి వెంకటనర్సయ్య, బూస అశోక్‌యాదవ్, సదర్‌లాల్, వెంకటేశ్వర్లు, కట్టయ్య, రమేష్, రాము, పోతరాజు కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

చెక్కులు అందజేత



సంగెం : నిరుపేద కుటుంబాలకు సీఎం సహాయ నిధి వరంగా మారిందని జెడ్పీటీసీ గూడ సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గవిచర్లలో ఇటీవల అనారోగ్యం బారిన పడి చికిత్స పొందిన లబ్ధిదారులు లింగాల ప్రేమలతకు రూ.60వేలు, మందపురి సునీతకు రూ.28వేలు, సామల లక్ష్మికి రూ.24 వేలు, యార యాకలక్ష్మికి రూ.16వేల సీఎం సహాయనిధి చెక్కులను బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చెన్నూరి యాకయ్య, మాజీ ఎంపీటీసీ దొనికెల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టార్పాలిన్ల పంపిణీ




వర్ధన్నపేట : వర్ధన్నపేట పట్టణంలోని ఏడో డివిజన్ కోనాపురంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎలికట్టె యాకయ్య పెంకుటిల్లు, మరో వ్యక్తి ఇల్లు పై కప్పు కూలిపోవడంతో వారు ఎంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాగా మాజీ జెడ్పీటీసీ పాలకుర్తి సారంగపాణి సోమవారం టార్పాలిన్లను అందజేశారు. నాయకులు యాకయ్య, ముత్తయ్య, అజయ్, సుమన్, ఆరోగ్యం, సుందరయ్య, ప్రభాకర్ ఉన్నారు.

బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగింత

పరకాల: పరకాల పట్టణానికి చెందిన సాయికృష్ణ కొద్ది రోజుల క్రితం సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. సీఈఐఆర్ అప్లికేషన్ పెట్టకోవడంతో సీపీ రంగనాథ్ ఆదేశాల మేరకు లొకేషన్ ఐడెంటీ చేసి స్వాధీనం చేసుకొని సీఐ వెంకటరత్నం చేతుల మీదుగా సోమవారం అప్పగించారు.

పౌరహక్కులను పరిరక్షించాలి



నెక్కొండ : గ్రామాల్లో అంటరానితనాన్ని పాటించడం వల్ల అభివృద్ధిలో వెనకబడిపోతామని, అలాంటి చర్యలకు ఎవరూ పాల్పడినా చట్టరీత్యా చర్యలు ఉంటాయని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని సూరిపల్లి గ్రామంలో సోమవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించగా, ఆయన హాజరై, మాట్లాడారు. ప్రజల హక్కులు, విధుల గురించి అవగాహన కల్పించారు. రాజ్యాంగం పౌరులకు ఇచ్చిన హక్కులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ పేర్కొన్నారు. ఈ సమావేశంలో సర్పంచ్ సింగారపు గీత, ఎంపీటీసీ శారద, ఆర్ఐ నరేందర్, ఏపీఓ జాకబ్, ఏపీఎం శ్రీనివాస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వాసంతి, దళిత సంఘాల నాయకులు ఈదునూరి వెంకటేశ్వర్లు, మాంకాల యాదగిరి, గ్రామస్తులు పాల్గొన్నారు.